నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 2 మార్చి 2025 | HYDERABAD

బల్దియాలో భారీ బదిలీలు

ఒకేసారి 139 మందిపై వేటు వేసిన కమిషనర్ ఇలంబర్తి

శానిటేషన్ విభాగం ప్రక్షాళన పేరిట ఏండ్లుగా పాతుకుపోయిన సిబ్బందిపై చర్యలు

కమిషనర్ చర్యలతో చెత్త నిర్వహణపై భిన్నాభిప్రాయం

IVలో

కష్టమొచ్చినా.. సంతోషమొచ్చినా అందరికీ కేసీఆరే గుర్తుకొస్తున్నారు

ఏడాదిన్నర దాటినా ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు కాలేదని.. ఇందిరమ్మ ఇండ్లు వస్తున్నాయని.. రేషన్‌కార్డులు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఇప్పటికీ ఇచ్చింది ఒక్కటి లేదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణలో ప్రజలకు కష్టమొచ్చినా.. సంతోషమొచ్చినా కేసీఆర్ గుర్తుకు వస్తున్నారని స్పష్టం చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో మేమంతా సంతోషంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారని చెప్పారు. ఏ గ్రామానికెళ్లి ఎవరినీ అడిగినా ఒక్కటే అంటున్నారని..కాంగ్రెస్ పాలన ఎప్పుడు పోతుందని అంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు ఎవైనా గెలుపు మాత్రం బీఆర్ఎస్‌దే కావాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం సమష్టిగా పని చేద్దామని పిలుపునిచ్చారు.

అప్పుడే గొంతెండుతోంది..!

గ్రేటర్‌లో మొదలవుతున్న తాగునీటి కష్టాలు

దారి మళ్లుతున్న జలమండలి ట్యాంకర్లు

సిటీబ్యూరో: షాపూర్‌నగర్-2 జలమండలి ఫిల్లింగ్ కేంద్రంలో గత నెల 28న ఉదయం ఒక వినియోగదారుడు ట్యాంకర్ నీటి కోసం బుక్ చేశారు. ఆ సమయంలో సీరియల్ నెంబర్ వందకు పైగానే ఉంది. రోజు గడిచినా ట్యాంకర్ రాకపోవడంతో శనివారం మధ్యాహ్నం 12.15 గంటల ప్రాంతంలో ఆన్‌లైన్‌లో ట్రాక్ (బుకింగ్ స్టేటస్) పరిశీలిస్తే నెంబర్-80గా చూపింది. సాయంత్రం 5.46 గంటలకు చూస్తే నెంబర్-75గా ఉంది. ఈ ఫిల్లింగ్ కేంద్రంలో దాదాపు 80-90 ట్యాంకర్లు ఉన్నట్లు తెలిసింది. మరి... రెండు రోజుల్లో అంటే 48 గంటల్లో 25-35 ట్యాంకర్లు కూడా సరఫరా కాలేదంటే నమ్మవచ్చా? డిమాండు ఎక్కడ ఉంటుందో అక్కడే 'అవకాశం' ఉంటుందనేది బహిరంగ రహస్యం. కనీసంగా 5-10 నిమిషాలకు ఒక ట్యాంకర్ వెళ్లాల్సిన చోట బుకింగ్ చేసినవారి నెంబరు నెమ్మదిగా కదలడం వెనక ఎన్ని ట్యాంకర్లు పక్కకు పోయాయనేది అర్థం చేసుకోవచ్చు.

* కుత్బుల్లాపూర్ నియోజకవర్గవ్యాప్తంగా నెల రోజుల నుంచే నీటి కొరత మొదలైంది. 25వ డివిజన్ పరిధిలో 15 రోజులుగా గోదావరి జలాల సరఫరా నిలిచిపోయాయి. గత్యంతరం లేక వినియోగదారులు ట్యాంకర్లు బుక్ చేస్తే పరిస్థితి ఇలా ఉంది.

* హఫీజ్‌పేట, చందానగర్, కొండాపూర్, మాదాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో నల్లా నీళ్లు నాలుగు రోజులకోసారి వస్తున్నది. అందునా లో ప్రెషర్‌తో జలమండలి అధికారులు విడిచిన నీళ్లు సరిపోక జనం అవస్థలు పడుతున్నారు. ఇలా గ్రేటర్‌లో ఎండలు ముదరకముందే నీటి కటకట మొదలువుతున్నది. ఉష్ణోగ్రతలు పెరిగి నీటి వినియోగం పెరిగిన వెంటనే ప్రైవేటు నీటి వ్యాపారం జోరందుకుంది. భూగర్భ నీటిమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి.

కోట్లలో నీటి వ్యాపారం

నగరంలో నీటి వ్యాపారం రూ. కోట్లలో సాగుతున్నది. ఎక్కడపడితే అక్కడ బోర్లు వేసి అక్రమంగా తరలిస్తున్న నీటిని ఒక్కో ట్యాంకరు సైజును బట్టి రూ.2 వేల నుంచి రూ.10 వేలదాకా విక్రయిస్తున్నారు.

సున్నం చెరువు... ఓ ఉదాహరణ...

కొందరు సున్నం చెరువులో బోర్లను వేసి నీటిని ట్యాంకర్లలో తరలిస్తున్నారు. పరీవాహక ప్రాంతంలో మోటార్లు పెట్టి అవి బయటకు కనిపించకుండా మట్టితో చదును చేస్తున్నారు. రోజుకు 100కు పైగా ట్యాంకర్ల నీటిని సున్నం చెరువులోని బోర్ల ద్వారా తోడుతున్నారు.

జలమండలి సరఫరాపై తీవ్ర ప్రభావం..

అక్రమ బోర్ల ద్వారా నీటిని తోడేస్తుండటంతో బస్తీల్లోని బోర్లు అడుగంటుతున్నాయి. ఫలితంగా నగర ప్రజలు జలమండలి ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ట్యాంకర్లకు డిమాండ్ పెరగటంతో బుక్ చేసుకున్న 24 గంటల తర్వాత వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. ప్రైవేట్ ట్యాంకర్లు గంటలోపే సరఫరా చేస్తుండటంతో ఎక్కువ డబ్బులు వెచ్చించి ప్రత్యామ్నాయం లేక కొంటున్నారు.



తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన వారితో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

హైడ్రాతో రియల్ రంగం విధ్వంసం

కుర్చీని కాపాడుకునేందుకే మూసీ సుందరీకరణ డ్రామా

రూ.లక్షా యాభై వేల కోట్ల ప్రాజెక్టుతో ఢిల్లీకి సంచులు

సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

సిటీ బ్యూరో, మార్చి 1 (నమస్తే తెలంగాణ): హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ రంగాన్ని విధ్వంసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సుమారు 500 మంది బీజేపీ, కాంగ్రెస్ నుంచి శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైడ్రా, మూసీ పేరుతో పేద ఇండ్లను కూల్చి వాళ్లను అవస్థల పాలు చేశారని మండిపడ్డారు. హైడ్రాను తనకోసమే తీసుకొచ్చినట్లుగా జన్వాడలో తనకున్న భూమిపైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కన్ను పడిందన్నారు. తన ఇంటిని కూల్చేందుకు కూడా తీవ్ర ప్రయత్నం చేశారని ఆరోపించారు. రూ.లక్షా యాభై వేల కోట్ల మూసీ ప్రాజెక్టుతో ఢిల్లీకి డబ్బుల సంచులు పంపి తన కుర్చీని కాపాడుకునేందుకే ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మూసీ సుందరీకరణతో ఎవరికి లాభం కలుగతుందని ప్రశ్నించారు. దాని వల్ల ఎంత మంది రైతులు బాగుపడతారు? దానితో సృష్టించే సంపద ఎంత? మూసీతో పారే ఎకరాలెన్ని? దాని వల్ల ఎవరికి లాభం కలగుతుందని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వంలో శంకరపల్లి పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుని ఉపాధి పొందారన్నారు. శంకరపల్లి పరిధిలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో రియల్ భూముల ధరలు గణనీయంగా పడిపోయాయన్నారు. దీంతో ఎంతోమంది రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నవారు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

త్వరలో ఉప ఎన్నికలు.. ఎమ్మెల్యేగా కార్తిక్‌రెడ్డి

రాష్ట్రంలో త్వరలో ఉప ఎన్నికలు రాబోతున్నాయని, పటోల్ల కార్తిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది శాసన సభలో అడుగుపెట్టబోతున్నారని జోష్యం చెప్పారు. చేవెళ్ల చెల్లెమ్మగా పేరొందిన సబితా ఇంద్రారెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులకు చుక్కలు చూపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. చేవెళ్ల జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, దాన్ని విస్తరించాలని కేసీఆర్ ఎన్నిసార్లు ప్రతిపాదించినా.. కేంద్రం స్పందించలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా చేవెళ్ల, శంకరపల్లికి నీళ్లు తీసుకురావడానికి ఆనాడు కేసీఆర్ కృషి చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలు కేసులేసి ఆపే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడకుండా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 90 శాతం పూర్తి చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి 10 శాతం పనిచేసి నీళ్లివ్వమంటే మూసీని సుందరంగా చేస్తానంటున్నారని ఎద్దేవా చేశారు.

అంకుషాపూర్ లోని డిఫెన్స్ ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

ఆర్మ్డ్ డిఫెన్స్ నిర్వీర్యం చేసేందుకు కుట్ర

ఘట్ కేసర్, మార్చి1: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం రహీంఖాన్ గూడ లో మహిళా సంక్షేమ ఆర్మీ కళాశాలను ఏర్పాటు చేస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నదని అంకుషాపూర్ లోని డిఫెన్స్ ఆర్మ్డ్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తూ శనివారం ధర్నాకు దిగారు. రహీంఖాన్ గూడ లో గత ప్రభుత్వ హయంలో ఆర్మ్డ్ సోర్సెస్ ప్రిపరేటరీ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసేందుకు అంకుషాపూర్ కు తరలించినట్లు ఆరోపించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో మరుగుదొడ్లు, స్నానాల గదులు తక్కువగా ఉండడంతో పాటు అరకొర ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు ఆరోపించారు. విద్యార్థునులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎన్నో ఆశలతో ఆర్మీ డిగ్రీ కళాశాలలో చేర్పించినట్లు పేర్కొన్నారు. ఏడాదిలోనే అమ్మాయిలపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షత చూపుతూ ఆర్మీ కాలేజీని భువనగిరి నుంచి ఘట్ కేసర్ కు తరలించిందని ఆరోపించారు. ఎందుకు తరలించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీశారు. కాగా, విద్యార్థినుల తల్లిదండ్రులు కళాశాల గేటు ముందు ధర్నాలు చేయడంతో గేట్లకు తాళాలు వేశారు. కళాశాల నుంచి విద్యార్థులు తమ న్యాయం కావాలని కళాశాల తరలింపు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కళాశాల నుంచి గేటు వద్దకు వచ్చి తాళం విరగొట్టి తల్లిదండ్రులతో కలిసి ధర్నాకు దిగారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరితే బెదిరింపులకు పాల్పడుతున్నామని విద్యార్థినులు ఆరోపించారు. డిఫెన్స్ ఆర్మీ మహిళా డిగ్రీ కళాశాల పరిరక్షణ పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కాసాగాని ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎర్రపల్లి నరసయ్య, కోశాధికారి యుగంధర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ నిరూపమా హామీ ఇచ్చినా తల్లిదండ్రులు ఆందోళన విరమించలేదు.

డైరెక్టర్ల నియామకమెప్పుడు!

నోటిఫికేషన్ ఇచ్చి 14 నెలలైనా ఊసేలేదు..

ఇన్‌చార్జిలతో కొనసాగిస్తున్న టీజీఎస్పీడీసీఎల్

విద్యుత్ సరఫరాపై మొక్కబడి పర్యవేక్షణ

ప్రతీ ఫైల్ సీఎండీ కార్యాలయానికి వెళ్లాల్సిందే..

ఇన్‌చార్జీలకు క్షేత్రస్థాయి అవగాహన లేదంటున్న ఉద్యోగులు

సిటీబ్యూరో, మార్చి 1(నమస్తే తెలంగాణ): టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో నిరంతరం నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగేలా చూడాల్సిన డైరెక్టర్ల నియామకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సాధారణంగా డైరెక్టర్లు విద్యుత్ సంస్థల పాలకమండలిలో సభ్యులుగా ఉంటారు. వీరు తమ పరిధిలోని డిస్కంలలో విద్యుత్ సరఫరా, నిర్వహణలపై పర్యవేక్షిస్తుంటారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో 24గంటల విద్యుత్ సరఫరాలో వీరి పాత్ర కీలకంగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే డైరెక్టర్లను తొలగించి వారిస్థానంలో సీజీఎంలు, సీఈ స్థాయి అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆ తర్వాత కొత్త డైరెక్టర్ల నియామకానికి ఆయా సంస్థలు నోటిఫికేషన్ ఇచ్చాయి. నోటిఫికేషన్ ఇవ్వడం, దరఖాస్తుల స్వీకరణ శరవేగంగా పూర్తిచేసినా డైరెక్టర్ల నియామకం మాత్రం నెలలు గడుస్తున్నా జరగడం లేదు. కనీసం దరఖాస్తుల పరిశీలన కూడా జరగలేదని దరఖాస్తుదారుల్లో కొందరు చెబుతున్నారు.

IVలో

సహారా మొదటి గేటు సమీపంలోని ప్రధాన రహదారిపై అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మన్సూరాబాద్, మార్చి 1: మన్సూరాబాద్ డివిజన్ సహారా స్టేట్స్ కాలనీ మొదటి గేటు సమీపంలోని ప్రధాన రహదారి పై ఫుట్ పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. సహారా మొదటి గేట్ నుంచి రెండో గేటు వరకు వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్లు, పుట్ పాత్ లు ఆక్రమించి వెలసిన అక్రమ నిర్మాణాలతో ఈ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుకు జోనల్ కమిషనర్ స్పందించారు. జోనల్ కమిషనర్ ఆదేశాలతో శనివారం ఉదయం రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సహారా మొదటి గేట్ నుంచి రెండో గేటు వరకు రోడ్డుకు ఇరువైపులా వెలసిన సుమారు 30 ఆక్రమణలను రెండు జేసీబీలతో తొలగించారు. ఇష్టానుసారంగా రోడ్లు, పుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ అధికారులు హెచ్చరించారు. పుట్ పాత్ ఆక్రమణలు తొలగించిన ప్రదేశంలో తిరిగి ఎవరైనా డబ్బాలు ఏర్పాటు చేసిన ఎలాంటి నిర్మాణాలు జరిపిన జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

అందానికో రేటు!

వయసు, ఆకర్షణే ప్రధానంగా యువతులకు గాలం..

రూ.25వేలు నుంచి రూ.2లక్షల వరకు పలుకుతున్న ధర

బర్మా, మయన్మార్ యువతులకు డిమాండ్

సిటీబ్యూరో, మార్చి 1 (నమస్తే తెలంగాణ): అక్కడ అందానికో రేటు కడతారు. వయసుని బట్టి ధర నిర్ణయిస్తారు. యువతులు, మైనర్ బాలికల కుటుంబాల అవసరాలను బట్టి రేటులో తేడా చూపిస్తారు. ఏ దేశపు యువతులకైతే ఎక్కువగా ఎక్కడ డిమాండ్ ఉంటుందో ఆయా ప్రాంతాలకు రవాణా చేస్తారు. కోల్‌కతా కేంద్రంగా దేశంలోని ప్రధాన నగరాలకు జరుగుతున్న మానవ అక్రమ రవాణా దందా ఇది.

IVలో

కాల్ నొక్కేస్తున్నారు..!

అవినీతి ఫిర్యాదులపై కాల్‌సెంటర్‌కు స్పందన కరువు

సిటీబ్యూరో: విద్యుత్ శాఖలో అవినీతి మితిమీరిన స్థాయికి చేరింది. ఉన్నతాధికారులు మొదలుకొని కింది స్థాయి ఉద్యోగుల వరకు గత పది నెలలుగా ఏడుగురు ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశమైంది. తాజాగా ఏడీఈ కార్యాలయంలో సతీశ్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడంతో ఎస్పీడీసీఎల్‌లో కొందరు ఉద్యోగుల అవినీతిపై చర్చ జరుగుతోంది. సెప్టెంబర్‌లో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఖైరతాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో అవినీతి ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రెండు నెంబర్లు 04023454884, 7680901912 ఇవ్వగా.. వీటికి మొదటి నెల తర్వాత పెద్దగా స్పందన లేదు. ఈ కేంద్రానికి మొదట్లో 10 నుంచి పదిహేను ఫిర్యాదులొచ్చాయి.అయితే వీటిపై ఉన్నతాధికారుల నుంచి సీరియస్‌గా స్పందన లేకపోవడంతో ఫిర్యాదుల సంఖ్య రానురాను తగ్గింది. కాల్‌సెంటర్‌కు స్పందన వస్తుందనుకున్నారో ఏమో.. ఇక ఆ విషయాన్నే మరిచిపోయారు. దీనికి కారణమేంటనే దిశగా సీఎండీ ఆరా తీశారు.

డిస్కంకు చెడ్డపేరు...!

కొందరు అవినీతి ఉద్యోగుల చర్యలతో మొత్తం డిస్కంకే చెడ్డపేరు వస్తున్నదంటూ సీఎండీ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు వార్నింగ్ ఇస్తూ వచ్చారు. గత సంవత్సరం చివరలో ఏడుగురు అధికారులను సస్పెండ్ చేయడమే కాకుండా తొమ్మిది మందికి షోకాజ్‌నోటీసులు ఇచ్చారు. విద్యుత్ శాఖలో అధికారులు ఎవరైనా పనికి లంచం అడిగితే ఫిర్యాదు చేయాలని సీఎండీ తెలిపారు. ఇందుకోసం సీఎండీ కార్యాలయంలో అవినీతి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. మొదట్లో సీఎండీ ఈ విషయంలో సీరియస్‌గా స్పందించినప్పటికీ ఆ తర్వాత సమ్మర్ యాక్షన్ ప్లాన్ నేపథ్యంలో బిజీ అయిపోయారు. అయితే కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై స్పందించడంలో సంబంధిత విభాగం పూర్తిగా విఫలమైందనే చెప్పాలి. ఎందుకంటే ఫిర్యాదుల్లో ఎక్కువగా సైబర్‌సిటీ, సంగారెడ్డి, మేడ్చల్‌లతో పాటు రూరల్ ప్రాంతాల నుంచి ఉన్నాయి. వీటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన డిస్కం అధికారులు ఆ దిశగా పెద్దగా స్పందించలేదనే విమర్శలున్నాయి.

స్టిక్కర్లకే పరిమితం..!

కాల్‌సెంటర్ల నెంబర్లు కేవలం స్టిక్కర్ల వరకే పరిమితం కాగా క్షేత్రస్థాయిలో మొత్తం దక్షిణ డిస్కం పరిధిలో పెద్దగా ప్రచారం జరగడం లేదన్న విమర్శలున్నాయి. ప్రధానంగా ఈ అవినీతి నిరోధానికి, లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలన్న అవగాహన వినియోగదారుల్లో కల్పించడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలను కూడా కిందిస్థాయిలోనే ఆపేస్తున్నారు. ఈ నెంబర్లపై పెద్దగా ప్రచారం కూడా చేయడం లేదు. దీంతో ప్రజల్లో ఈ నెంబర్ల గురించి పెద్దగా తెలియదనే చెబుతున్నారు.

'మా బతుకులు రోడ్డుపాలు చేయొద్దు'

మాట్లాడుతున్న చిరు వ్యాపారులు

అడ్డగుట్ట, మార్చి 1: 'రోడ్డుమీద పండ్లను అమ్ముకుంటూ జీవితాలను సాగిస్తున్నాం... మా వ్యాపారాలను తీసేసి మా బతుకులను రోడ్డుపాలు చేయడం సరికాదు' అని లాలాగూడ చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా వ్యాపారాలను నిర్వహించుకునే అవకాశం లేకుండా పోవడంతో శనివారం లాలాగూడ చిరు వ్యాపారులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి గోడును వెల్లబోసుకున్నారు. 20 ఏండ్లుగా సుమారు 100 కుటుంబాలు పండ్ల వ్యాపారాలను నిర్వహించుకుంటూ బతుకులను వెల్లదీస్తున్నారని, ఉన్నట్టుండి ట్రాఫిక్ పోలీసులు వ్యాపారాలను నిర్వహించుకోకుండా బండ్లను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా వ్యాపారాలు లేకపోవడంతో ఎటు దిక్కుతోచని పరిస్థితుల్లో కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాయన్నారు. తాము వ్యాపారాలను నిర్వహించుకునే విషయంలో రైల్వే అధికారులకు ఎలాంటి అభ్యంతరం లేదని, ట్రాఫిక్ పోలీసులు వ్యాపారాలను తొలగించాలని తీవ్రస్థాయిలో తమపై ఒత్తిడి చేస్తున్నారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. కార్యక్రమంలో స్ట్రీట్ వెండర్స్ మహమ్మద్ నిజాముద్దీన్, సయ్యద్ సమీర్, రాజు, తాజ్, గౌస్, అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.